# జీవిత బంధం

ఆ రోజు కొంచెం అసాధారణంగానే మొదలయింది.

పెళ్ళికాని రచయిత్రి రాసిన ప్రేమకథలో సన్నివేశంలోలా, మా మొదటి మేరేజ్ డే నాడు, ఉదయం తొమ్మిది గంటలవరకూ ప్రేమాకాశంలో ప్రేమమబ్బులు తేలి ఆడాయి. ప్రేమ పక్షులు ప్రేమ గీతాలు పాడాయి. నేపథ్యంలో ప్రేమ వీణలు మోగాయి.

వంటింట్లోంచి ఉప్మా పోపు వాసన కమ్మగా తగలగానే నా ముక్కును నేను నమ్మలేక వంటింట్లోకి పరిగెట్టి, 'ఏం చేస్తున్నావు డియర్' అన్నాను.

'నీ కిష్టవని ఉప్మా చేస్తున్నాను డియర్' అంది సంధ్య. ఈసారి నాకు నా చెవుల మీద నమ్మకం పోయింది. నాకిష్టవని సంధ్య ఏదైనా చెయ్యడం నా మూడు వందల అరవై నాలుగు రోజుల వైవాహిక జీవితంలో ఇదే మొదటిసారి.

ఏడాది నుంచి టు-మినిట్ నూడిల్సు, బ్రెడ్ , కోడి మార్కు కార్న్ ప్లేక్స్- ఏ గడ్డి పడితే ఆ గడ్డి తింటూ బతుకుతున్నాను. వాములు తినే సాములారికి పచ్చగడ్డి ఫలహారవా అన్నట్లు, పూరీ, చపాతీ, పెసరట్టు, ఉప్మా లాంటి బరువైన టిఫిన్లకు అలవాటుపడ్డ నాకు ఈ నాజూకు తిళ్ళు ఏవీ ఆనటం లేదు. అంచేత ఈ రోజు సంధ్య ఉప్మా చేస్తున్నానంటే నా మనసు ఆనందంతో నిండిపోయింది.

'ఎందుకు డియర్ – నీకీ శ్రమ' అన్నాను అభిమానంగా కళ్ళు తుడుచుకుంటూ.

'నీ కోసం కష్టపడ్డంలో శ్రమేముంది డియర్' అంది సంధ్య పోపులో నీళ్ళు పోస్తూ.

రెండు నిమిషాల్లో రెండోసారి షాక్ తగిలింది. రోజూ నేను వంటమనిషినా, పనిమనిషినా అంటూ పోట్లాడే మనిషి అలా మాట్లాడితే షాక్ తగలక ఏవవుతుంది?

ఏవిటి, ఈ రోజు ఇలా మాట్లాడుతోంది, అని అనుమానం వచ్చి పడకగదిలో మంచం కింద దూరి జాంగో పెట్టె బయటకి ఈడ్చి పరిశీలించి చూశాను.

మా పెళ్ళయ్యాక మాకు వీడ్కోలు చెప్పడానికి స్టేషనుకు వస్తూ, జాంగో సినిమాలో జాంగో శవపేటిక ఈడ్చుకొచ్చినట్లు, మా మావగారు ఆయాసపడుతూ ఓ పెద్ద పెట్టె ఈడ్చుకొచ్చారు. ఆయన నాతో ఏదో చెబుదామనుకున్నారు కానీ, ఆయన గొంతు దుఃఖంతో మూగబోయింది – తండ్రి హృదయం కదా!

'ఏం బెంగెట్టుకోకండి మీ అమ్మాయి గురించి' అన్నాను నేను ధైర్యం చెబుతూ.

అప్పటికి ఆయన గొంతు పెగిలింది – 'బెంగ దాన్ని గురించి కాదు నాయనా, నీ గురించే. ఎలా వేగుతావో ఏవిటో?' అన్నారు ఆయన దిగులుగా పెట్టె కేసి చూస్తూ, నన్ను వేయించడానికి ఆ పెట్టెలో పెనం ఉందా, బూరెల మూకుడుందా అనుకుని చిరునవ్వు నవ్వాను – వేయించుకు తినడానికి పెనాలు, బూరెలమూకుళ్ళు అక్కర్లేదని తెలియని అజ్ఞానిని కదా! ఏం ఫరవాలేదన్నట్లు ఆయన భుజం మీద తట్టి ఆ సంగతి అప్పుడే మరిచిపోయాను.

కొత్త ఇంట్లో అన్నీ సర్దుతుంటే జాంగో పెట్టె కనుపించి, 'ఏం ఉంది ఇందులో' అన్నాను మావగారి మాటలు గుర్తుకొచ్చి.

'స్త్రీవాదం' అంది సంధ్య, కళ్ళు మిలమిల మెరుస్తుండగా.

ఆ రోజునుంచీ నా బతుకు దుర్భరమైపోయింది. వాళ్ళేం రాశారో, సంధ్య ఏ వర్థం చేసుకుందో నాకు తెలియదు కానీ మాట్లాడితే, నీ బానిసను కాను అంటూ లేస్తుంది. తనకి మూడ్ లేనప్పుడు చెయ్యేస్తే 'రేప్' అంటుంది. సంసారంలో ఉండాల్సిన సహజత్వం, స్పాంటేనిటీ పోయి, ఏం మాట్లాడితే ఏం ముంచుకొస్తుందో, ఏం చేస్తే ఏం ప్రమాదమో అని భయపడుతూ ఏడాది నుంచీ ఈ పోట్లగొడ్డుతో సహజీవనం సాగిస్తున్నాను.

జాంగో పెట్టె రెండు, మూడు వారాల నుంచీ తెరిచినట్లు లేదు. పెట్టె పైన దుమ్ము పేరుకుంది. ఇదన్నమాట సంధ్య ఇవాళ ఇంత ప్రేమగా ఉండడానికి కారణం అనుకుని నిట్టూర్చి, పెట్టెని మంచం కిందకు తన్ని, ఈ మధుర స్వప్నం ఎప్పుడు చెదిరిపోతుందో అని భయపడుతూ హాల్లోకి వెళ్లాను.

'ఉప్మాలో కొంచెం నీళ్ళెక్కువయ్యాయి డియర్' అంది సంధ్య ఉప్మా అందిస్తూ.

'నీ చేతులతో అందిస్తే విషమైనా మధురంగా ఉంటుంది డియర్' అని గ్లాసు అందుకుని ఉప్మా తాగుతూ పేపరు చూడ్డం మొదలు పెట్టాను.

అరగంటలో మరో ప్లేటుతో ప్రత్యక్షమైంది సంధ్య.

'ఏవిటిది డియర్?' అన్నాను ప్లేటు మీద చంద్రశిలలాంటి పదార్థం చూసి ఉలిక్కిపడి.

'మైసూర్ పాక్ డియర్ – ఎలా ఉందో చెప్పు'

కొరుకుదామంటే కొరుకుపడలేదు. ఉలి, సుత్తి తీసుకొచ్చి, 'శిలలపై శిల్పాలు చెక్కినారూ – మనవాళ్ళు సృష్టికే అందాలు తెచ్చినారూ' అని పాడుతూ సుత్తితో ఓ దెబ్బేశాను. సుత్తిదెబ్బ తగలగానే అర కిలో ముక్క గంతేసి కిటికీలోంచి ఎగిరిపోయింది. మరుక్షణంలో 'హా రామా' అని కిందనుంచి ఆర్తనాదం వినిపించింది. 'ఎవడో చచ్చిపోయాడు ఈ వేళ' అని కంగారుపడుతూ కిందికి పరిగెట్టాను.

కింది వాటా శర్మగారు ఇంటిముందు మొక్కల మధ్య రాయిలా నిలబడిపోయి పిచ్చి చూపులు చూస్తున్నారు. ఆయన తలనుంచి రక్తం ధారగా కారుతోంది. ఇంతటి రక్తపాతానికి కారణభూతమైన మైసూరుపాక్ ముక్క ఆయన కాళ్ళ దగ్గర మొక్కల్లో పడి ఉంది.

'ఏవిటి శర్మగారూ, ఏవైంది?' అనడిగాను ఏవీ తెలియనట్లు. ఆయన్ని అలా పలకరిస్తూ కాలుతో మైసూరుపాక్ ముక్కని మట్టి లోపలికి నొక్కేసి సాక్ష్యాధారాలు లేకుండా చేశాను.

'ఏవిటో తెలియదు నాయనా – యోగాసనాలు వేసి, ఇప్పుడే కేబులు వాడు రామాయణం వేస్తుండగా కొంచెం ప్రాణవాయువు పీలుద్దావని మొక్కల మధ్యకు వచ్చాను – ఉన్నట్టుండి తల పేలినట్లయింది' అంటూ శర్మగారు తల తడుముకున్నారు. తడితడిగా రక్తం చేతికి తగలగానే ఉలిక్కిపడి, చెయ్యి తీసి, రక్తం చూసి, 'అమ్మో – రక్తం – చచ్చిపోయా' అంటూ మూడే మూడు మాటలు మాట్లాడి కళ్ళు తేలేశారు శర్మగారు. ఆయన్ని ఆస్పత్రికి తీసుకెళ్ళి కట్టు కట్టించి తీసుకొచ్చేటప్పటికి పదకొండయింది.

'చెప్పా పెట్టకుండా హఠాత్తుగా ఎక్కడికి వెళ్ళిపోయావు?' అడిగింది సంధ్య.

'శర్మగారిని హాస్పిటలుకు తీసుకెళ్ళాను'

'ఏవైంది పాపం?'

'ఆయన నీ మైసూర్ పాక్ ముక్కకి బలైపోయాడు' అని జరిగింది చెప్పాను.

'మైసూరు పాక్ ఏవిటి? ఆ బట్టతలమీద పీచు మిఠాయి పడ్డా అలాగే జరిగేది' అంది సంధ్య మొహం మాడ్చుకుని.

ప్రేమవీణలో ఓ తీగ తెగిపోయింది. ప్రేమపక్షులు కుహూకూజితాలు ఆపుచేసి ఎగిరిపోయాయి.

సంధ్య ముభావంగా వంటింట్లోకి వెళ్ళిపోయిన తర్వాత నేను స్నానం చేసి, ప్రత్యేకంగా మేరేజ్ డే కని ముచ్చటపడి కొనుక్కున్న డ్రెస్సు వేసుకుంటుంటే, 'ఏవిటి ఆ పిచ్చి డ్రెస్సు?' అని నన్ను చూసి కెవ్వుమంది సంధ్య.

ఎరుపురంగు ప్యాంటు, దాని మీద పసుపు పచ్చరంగు పొడుగు చేతుల చొక్కా, దానిమీద పెద్ద పెద్ద నల్లటి బటనులు, పెద్ద పెద్ద జేబులు, ఆకుపచ్చ రంగు కాలరు ఎంతో సరదాపడి నేను కొన్న డ్రెస్సు పిచ్చ డ్రెస్సంటే నాకు కోపం వచ్చింది. నేను సమాధానం చెప్పడానికి తలెత్తగానే ప్రేమాకాశంలో ఓ మూల నల్ల మబ్బుతునక కనిపించింది. ఈ రోజు కూడా ఎందుకు పోట్లాట అని మాట్లాడకుండా తెల్ల బూట్లు వేసుకుంటుండగా మళ్ళీ కెవ్వుమంది సంధ్య – 'ఈ వెధవ డ్రెస్సుకి తోడు తెల్లబూట్లు కూడానా – నాకు తెలియకుండా ఈ డ్రెస్సు ఎప్పుడు కొన్నావు?' అంది మొహం వికారంగా పెట్టి.

'నీకు తెలియడవెందుకు? డ్రెస్సు వేసుకునేది నేను'

'ఆ డ్రెస్సేవిటి నా తలకాయలా – ఎర్రప్యాంటూ, పచ్చచొక్కా, తెల్లబూట్లూ – పెద్ద సినిమా హీరోలా – చిరంజీవిననుకుంటున్నావా?'

'నువ్వేవన్నా విజయశాంతి ననుకుంటున్నావా?'

'నేను అనుకోడం లేదు కానీ, అంతా అంటారు' అంది గొప్పగా.

'నువ్వు విజయశాంతిలా ఉండవు – విజయశాంతి పక్క చెలికత్తెలా ఉంటావు'

చూస్తుండగానే ప్రేమాకాశం మీద తుఫాను మబ్బులు వచ్చేశాయి.

'పక్క చెలికత్తెలాగానా?' – సంధ్య మొహం ఎర్రబడింది.

'సారీ – నువ్వు నన్ను అపార్థం చేసుకున్నావు – పక్క చెలికత్తె అంటే పక్క చెలికత్తె కాదు...' – కొంచెం వివరంగా చెప్పాను – '... పక్క చెలికత్తె అందంగానే ఉంటుంది – విజయశాంతి పాడుతుంటే వెనకాల ఆ... ఆ... ఆ... అంటూ ఇరవైతొమ్మిది మంది పరిగెడతారే – ఆ ఇరవైతొమ్మిదో చెలికత్తెలా ఉన్నావు.'

'ఇరవైతొమ్మిదో చెలికత్తెలా ఉన్నానా? నువ్వే జెమినీ సర్కస్‌లో చింపాంజీలా ఉన్నావు' అంది సంధ్య ముక్కుపుటాలెగరేసి.

'నన్ను చింపాంజీ అంటే ఊరుకోను – నువ్వు ఆ చారల చారల కంప్యూటర్ డిజైను చీర కట్టుకుంటే కంచరగాడిదలా ఉన్నావనుకున్నాను కానీ, పైకి అన్నానా?'

'నేను కంచరగాడిదనా?'

'జెమినీ సర్కస్‌లో కంచర గాడిద కాదు - అది బాగానే ఉంటుంది'

'నేను సాయంత్రం బండికి మా ఊరు వెళ్ళిపోతున్నాను' అంటూ మైసూర్ పాక్ ముక్కలన్నీ డబ్బాలో సర్దసాగింది.

'అది దేనికి?'

'మా ఊరు తీసికెడతాను'.

'అతివాదుల గొడవల్లో పోలీసులు బేగ్‌లు చెక్ చేస్తున్నారు. మారణాయుధాలు వాళ్ళ కంటబడితే ప్రమాదం'.

'నేనిక్కడ ఓ క్షణం కూడా ఉండను - ఒంటిగంట బస్సులో వెళ్ళిపోతున్నాను' అని సంధ్య టైము ఎడ్వాన్సు చేసింది.

'ఈ వెధవ పెట్టె కూడా తీసుకుపో' అన్నాను జాంగో పెట్టె చూపిస్తూ.

'తీసుకుపోక - ఇంట్లో ఉంచుతాననుకున్నావా?'

'పద - బస్సెక్కించి వస్తాను'.

'ఈ డ్రెస్సులో నిన్ను చూసి పోలీసులు పిక్ పాకెట్టని నాలుగు తన్ని జెయిల్లో పడేసినా పడేస్తారు. నాకు నామోషీ. వద్దు - నేను వెళ్ళగలను' అంటూ వెళ్ళిపోయింది సంధ్య. ఒక్క రోజైనా ఆనందంగా గడుస్తోందనుకుంటే, చినికి చినికి గాలివానై ఇలా అయిందేవిటా అని దిగులుగా, పరధ్యానంగా అలా కూర్చుండిపోయిన నాకు కాలింగ్ బెల్లు ఫైరింజన్లా మోగుతుంటే తెలివొచ్చింది. సంధ్య మనసు మార్చుకు వచ్చేసిందేమో అనుకుంటూ ఆత్రతగా తలుపు తీశాను.... ఎదురుగా సాంబుడు.

'మీ ఆవిడ వెళ్ళిపోయిందన్నమాట' అన్నాడు సాంబుడు లోపలికి వస్తూ.

'మా ఆవిడ వెళ్ళిపోయినట్లు నీకెలా తెల్సింది' అన్నాను ఆశ్చర్యపోతూ.

సాంబుడు నవ్వాడు - 'కొంపలంటుకు ఏడుస్తోన్నవాడికి ఫైరింజను ఎలా వచ్చిందో ఎందుకు?'

'కొంపలేం అంటుకోలేదు - సంధ్య కీ, నాకూ చిన్న తగాదా అయింది'.

'పిచ్చి సన్నాసి - ఇది మీ పెర్సనల్ విషయం అనుకున్నావా?'

'సంధ్యకూ, నాకూ తగాదా అయితే అది మా పెర్సనల్ విషయం కాదా?' అన్నాను నేను ఆశ్చర్యపోయి.

'కాదు – పెర్సనల్ ఈజ్ పొలిటికల్ – ఇది రాజకీయ సమస్య – ఇంక్విలాబ్ జిందాబాద్ – ప్రపంచ మొగుళ్ళారా! ఏకం కండి – అభాసం జిందాబాద్'.

'అభాసం ఏవిటి?'

'అఖిల భారత భార్యాపీడితుల సంఘం – భార్యాపీడితులం మనం ఒక సంస్థగా ఏర్పడాలి – పీడిత మొగుళ్ళంతా ఒకటైతే ఏ ఆదిశక్తీ మనల్నేం చెయ్యలేదు – చిరంజీవి జిందాబాద్....'

'చిరంజీవి కూడా ఉన్నాడా?' – అన్నాను నేను ఆనందంగా.

'సినిమా చిరంజీవి కాదు – ఇనపకొట్టు చిరంజీవి. వాడు మన సంఘం ప్రెసిడెంటు. రేప్పొద్దుట లింగమూర్తి ఇంటికి వెడదాం. వాడు మనకు థియరిటీషియన్. సంఘం ఆవశ్యకత గురించి, ఆశయాల గురించి వివరంగా చెబుతాడు. అక్కడికి మన్మథరావు కూడా వస్తున్నాడు'.

'మన్మథరావెవరు?'

'మన్మథరావు పేరు విన్లేదా?' – సాంబుడు తల పట్టుకున్నాడు – 'ప్రముఖ మగవాద కవి – వాడి కవిత్వం వింటుంటే రక్తం మరిగిపోతుంది – రేపు చూస్తావుగా'.

మర్నాడు లింగమూర్తి ఇంటికి వెళ్ళాం. లింగమూర్తి నన్ను చూడగానే సంతోషంతో ఎదురొచ్చి – 'మీ ఆవిడ నిన్ను వదిలేసిందటగదా – కంగ్రాచ్యులేషన్స్– విష్ యు ఎ వెరీ హేపీ డైవోర్స్డ్ లైఫ్' అన్నాడు అభినందిస్తూ. ఈ వార్త ఊరంతా వ్యాపించిందన్నమాట.

'మన లింగమూర్తి భాషలో స్త్రీ భావజాలం అనే విషయం మీద పరిశోధన చేస్తున్నాడు' అన్నాడు సాంబుడు.

'భాషలో స్త్రీ భావజాలం ఏవిటి?'

'భాష అనేది ఒక అణచి వేసే సాధనం. అసలు భాష మారిస్తేకానీ మగతనానికి గుర్తింపు రాదు. ఉదాహరణకు, ఆవు వస్తోంది అంటాం. ఎద్దు మగ జంతువు కదా – ఎద్దు వస్తున్నాడు అనకుండా, వస్తోంది అని ఎందుకంటున్నాం? అదే స్త్రీ భావజాలం. స్త్రీ స్వామ్య వ్యవస్థ మగతనాన్ని నపుంసకలింగంగా మార్చేసింది. మనం ఈ భాషకు, భావజాలానికి వ్యతిరేకంగా పోరాడాలి. రేపటి నుంచి ఎద్దు వస్తున్నాడు, దున్నపోతు గడ్డి తింటున్నాడు, గాడిద.....'

'.... మగ గాడిద అవునో కాదో చూసి....'

'..... చూసి, గాడిద పరిగెడుతున్నాడు అనాలి. నేను భాషా విప్లవం తీసుకు రాబోతున్నాను' అంటూ లింగమూర్తి ఓ గంటసేపు బోరేసి, 'మన్మథా! నాలుగు కవితలు వినిపించు నాయనా' అన్నాడు మన్మథరావుతో.

మన్మథరావు కవిచౌడప్ప గురువులా ఉన్నాడు. వాడి కవితలు వినలేక చెవులు మూసుకున్నాను.

'ఛ... ఛ.... ఏవిటా బూతులు?' అన్నాను ఇబ్బందిగా కదులుతూ.

'ఆడవాళ్ళు స్త్రీవాద కవిత్వమని నిస్సంకోచంగా అడ్డమైన బూతులూ రాసి పడేస్తుంటే, నువ్వేవిటి అలా మెలికలు తిరిగిపోతున్నావు? – ఇవి బూతు కవితలా? విప్లవ కేతనాలు....' అన్నాడు సాంబుడు మందలిస్తూ.

'ఏం విప్లవమో ఏవిటో – ఇదంతా కోతుల మేళంలా ఉంది' అన్నాను లింగమూర్తిని వదిలించుకుని బయటపడి. అప్పటికి సాయంత్రం ఏడు గంటలయింది.

'విప్లవం నీ కళ్ళకు కోతుల మేళంలా కన్పిస్తోందా?' అన్నాడు సాంబుడు తీవ్రంగా.

'విప్లవం సంగతి అలా ఉంచు. ఆకలేస్తోంది. హోటలుకెళ్ళి భోంచేద్దాం' అన్నాను నీరసంగా.

'విప్లవకారులకి ఆకలి దప్పులుండకూడదు. అసలు ఆకలి అనేది మన బలహీనతల్లో ఒకటి. అందుకే వంటిళ్ళు బద్దలు కొట్టాలంటున్నారు మన వర్గ శత్రువులు. వంటిళ్ళు బద్దలు కొడితే మనం లొంగిపోతావని వాళ్ళ ఎత్తుగడ. విప్లవకారులు టీ నీళ్ళతోనే గడపాలి' అంటూ ఇరానీ హోటలుకి తీసుకెళ్ళి రెండు బన్నులకి, రెండు టీలకి ఆర్డరిచ్చాడు సాంబుడు.

టీ తాగుతూ నన్ను పరిశీలనగా చూస్తూ, 'నీ గెటప్ బాగాలేదు. కొంచెం గెడ్డం పెంచు. జేబులో అగ్గిపెట్టె, సిగరెట్టు ఉంచుకో. నీ బుర్ర ఖాళీగా ఉండి, ఏం మాట్లాడాలో తెలియనప్పుడు టైమ్ గెయిన్ చెయ్యడానికి ఉపయోగపడుతుంది. కొంచెం విప్లవకారుడి పోజు రానీ' అన్నాడు.

'నిన్ననే కదా సంధ్య వెళ్ళిపోయింది. ఓ వారం రోజులు పడుతుంది పోజు రావడానికి' అన్నాను దిగులుగా. నాకు విప్లవకారుడిగా ఉండాలని లేదు. సంధ్యతో సర్దుకుపోయి కలిసి ఉండాలని ఉంది.

సాంబుడు నన్ను మా ఇంటి దగ్గర దింపేసి, 'గంటలో వస్తాను. రేపటి కార్యక్రమం చర్చిద్దాం' అంటూ స్కూటరెక్కి వెళ్ళిపోయాడు.

'ఇంట్లో లైటు వెలుగుతోంది దొంగాడొచ్చాడా, సంధ్య తిరిగి వచ్చేసిందా' అని ఆలోచిస్తూ మెల్లగా డూప్లికేట్ కీతో తలుపు తెరిచి చూశాను - ఎదురుగా హాల్లో జాంగో పెట్టె - సోఫాలో బామ్మగారూ, బామ్మగారి వెనకాల గది గుమ్మం దగ్గర సంధ్యా కనిపించారు. సంధ్య కనిపించగానే ఆనందంతో ఎగిసిపడిన గుండె బామ్మగార్ని చూడగానే ఆగిపోయింది.

బామ్మగారంటే చుట్టపక్కాలందరిలోనూ టెర్రర్. ఆవిడ మా మావగారు పుట్టగానే, అంటే పదిహేనవ ఏటో, పదహారవ ఏటో భర్తని వదిలేసింది. ఇంట్లో మెట్రిక్ పూర్తిచేసి, పైచదువులు చదివి, చివరకు లెక్చరరుగా రిటైరయింది. మొగుడు చావు బతుకుల్లో ఉన్నాడని తెలిసినా చూడ్డానికి వెళ్ళలేదు. ఆయన పోయాక బొట్టు చెరుపుకోలేదు. గాజులు తియ్యలేదు. దయాదాక్షిణ్యాలు లేని మనిషి అంటారు ఆవిణ్ణి అంతా....

నేను లోపలికి అడుగుపెట్టగానే, 'రావోయ్ - రా' అన్నారు బామ్మగారు. కంచుగంట మోగినట్లయింది. 'ఇప్పుడేం చెబుతావో చెప్పు' అన్నట్టు ధీమాగా నిలబడి గీరగా చూసింది సంధ్య. నేను భయపడుతూ లోపలికి నడిచాను. బామ్మగారికి వినబడకుండా, సంధ్యకు వినబడేలా 'బామ్మల్ని, అమ్మమ్మల్ని తీసుకుని యుద్ధానికి వచ్చే ఝాన్సీ రాణీలను చూస్తే నాకు జాలేస్తుంది' అన్నాను మెల్లగా.

'ఝాన్సీరాణీకి ఎవరి సహాయం అక్కర్లేదు - ఒంటరిగానే పది చింపాంజీలకు బుద్ధి చెప్పగలదు - ఆవిడే వస్తానంది'.

'పద - బాగా ఆలస్యమైంది- ముందు భోంచేద్దాం' అన్నారు బామ్మగారు.

'నేను హాయిగా హోటల్లో భోంచేసి వచ్చాను.... బ్రేవ్.... ' అంటూ బలవంతం మీద తేన్చి ఆవులించాను. తేన్పెలా వస్తుంది, పొట్ట ఖాళీగా ఉంటే- 'ఆకలేసిన వాళ్ళుతినొచ్చు. నేనిప్పుడు రెండు సిగరెట్లు కాల్చి, రెండు పెగ్గులేసుకుని, రెండు గంటలు పడుకుంటా. స్వేచ్ఛా జీవిని..... హ్హా..... హ్హా.... ' అంటూ జేబులోంచి సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె తీశాను.

స్టయిల్‌గా సిగరెట్టు నోట్లో పెట్టి అగ్గిపుల్లేశాను. అగ్గిపుల్లలు తగలడుతున్నాయి కానీ సిగరెట్టు అంటుకోడం లేదు. సాంబుడు గాడిద సిగరెట్టు పెట్టె, అగ్గిపెట్టె కొనిపెట్టాడు కాని కాల్చడం నేర్పలేదు.

'బామ్మా! ఫిల్టరు వైపు అంటిస్తే అంటుకోదు - తిరగేసి అంటించాలి' అంది సంధ్య.

'రోజూ సిగరెట్టు కాల్చేవాళ్ళకు బాగా తెలుస్తుంది - నాకెలా తెలుస్తుంది బామ్మగారూ' అన్నాను.

'నాన్న సిగరెట్టు మీద సిగరెట్టు అంటిస్తాడు కదా బామ్మా - రోజూ చూస్తూనే ఉంటాను'.

బామ్మగారు సిగరెట్టు గురించి ఏవీ అనలేదు కానీ - 'భోంచేస్తే చేశావులే! మళ్ళీ మాతో చెయ్యి' అని బలవంతం చేశారు.

'పెద్దవారు - మీ మాట కాదన కూడదు' అని డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాను. సంధ్య ముగ్గురికీ వడ్డించింది.

'బామ్మగారూ! కొంచెం ఆ ఎర్రరంగు పులుసు అందుకోండి' అన్నాను.

'అది పులుసు కాదు, కూర' అంది సంధ్య, కూరలా ఎర్రబడ్డ మొహంతో.

'అది పులుసు కాదు కూర అయితే, ఇది 'కూర కాదు పులుసు' అయి ఉంటుంది - ఆ పచ్చరంగు పదార్థం వెయ్యండి' అన్నాను బామ్మగారితో. నేను తలెత్తి చూళ్ళేదు కాని ఆ డైలాగు ఎఫెక్టు ఎలా ఉంటుందో నాకు తెలుసు.

నాకే కాదు - బామ్మగారికీ తినడం కష్టమైనట్టుంది. పప్పు ఉడకలేదు, పులుసులో ఉప్పు ఎక్కువ, కూరలో కారం ఎక్కువ.

'ఏవిటే ఈ వంట?' అన్నారు మనవరాలితో.

'నాకు వచ్చినట్టు చేశాను - నాకు ఇంతకంటే బాగా రాదు'.

'ఎందుకు రాదు? అదేదో బరువూ, చాకిరీ అనుకోకుండా, చేసే పని మీద శ్రద్ధ ఉంచి చేస్తే అదే వస్తుంది' అన్నారు బామ్మగారు ఘుందలిస్తూ. బామ్మగారి మాటలు వీణ మీటినట్లుగా ఉంది నా చెవులకి.

'బామ్మగారూ! కొంచెం వక్కపొడి వేసుకోండి - త్రివేణీ వక్కపొడి - ఆ నోటి చేదు పోతుంది' అన్నాను ఆనందంగా బామ్మగారికి వక్కపొడి అందిస్తూ.

'బామ్మా! నేను యూనివర్సిటీ చదువులు చదివింది అమ్మలా వంటింటికి అంకితమై పోవడానికి కాదు. ఉప్మా, పెసరట్టు తినడానికే నేను బతకడం లేదు' - నాకేసి ఓరగా చూస్తూ అంది సంధ్య - 'అంతకంటె ఉన్నత లక్ష్యమే ఉంది. నా జీవితానికి'.

'వంటింటికి పరిమితమై పొమ్మని అంటల్లేదే - చేసే వంట సరిగా చెయ్యొచ్చు కదా అంటున్నాను' అన్నారు బామ్మగారు శాంతంగా.

'బామ్మా! నా వంటని విమర్శించడం నాకిష్టం ఉండదు. అసలు నేను ఇంట్లో వంటమనిషినా?' అంది సంధ్య కోపంగా.

'అడ్డమైన వంటకాలూ చేసి నా మీద పరిశోధించడానికి నేనేవన్నా గినీ పిగ్‌నా?' అన్నాను నేను.

'గినీ పిగ్ వో, యంసీపీవో – నువ్వేవిటో నీకే తెలియాలి కానీ, నేను బట్టలుతికే వాషింగ్ మెషీన్ని కాదు'.

'నేను సంసారం మోసే గాడిదని కాను'.

'ఇందాకా గినీ పిగ్ అన్నావు?'

'గినీ పిగ్‌నీ, గాడిదనీ...'

'అసలు మగాడికి పెళ్ళాం కాదు కావాల్సింది, ఫ్రీగా ఇంట్లో పనిచేసే నౌకరు'.

'ఫ్రీగా ఏవవుతోంది – తడిసి మోపెడవుతోంది'.

'నెలకు మూడొందలు లేకుండా ఏ పనిమనిషీ రాదు. చాకలికో రెండొందలు. వంట చేసినందుకు రెండువేలు...'

'నేనూ వంట చేస్తున్నాను కదా అప్పుడప్పుడు'.

'పోన్లే – అయిదొందలు తీస్తే – వంటకి పదిహేనొందలు. పెళ్ళాం జీతం బత్తెం లేకుండా పనిచేస్తుంటే తెలియడం లేదు'.

'అసలు నువ్వు లేకపోతే ఇంత పెద్దిల్లు అక్కర్లేదు. సాంబుడి గదిలో షేరు చేసుకుని, హాయిగా హోటల్లో తింటూంటే నాకే అద్దె మిగులు....'

బామ్మగారు ఓపిగ్గా విని విని, 'అయ్యాయా లెక్కలు? ఇంకా ఎవరు, ఎవరికి, దేనికి, ఎంతిచ్చుకోవాలో లెక్కేసుకోవడం మర్చిపోయారేమో చూసుకోండి' అన్నారు.

'ఇంకా అసలు దానికి లెక్కే వెయ్యలేదు' అంది సంధ్య.

'అసలు దానికి విజయశాంతి పక్క..... ఇరవైతొమ్మిదో చెలికత్తే, ఎదురివ్వాలి'.

బామ్మగారి ఓపిక నశించింది – 'ఇలా సిగ్గూ శరం లేకుండా లాభనష్టాలు లెక్క పెట్టుకుంటూ సంసారాన్ని వ్యాపారంగా, జమాఖర్చుల పద్దుగా మార్చేబదులు అసలు పెళ్ళి చేసుకోకుండా ఏడ్వచ్చుగా' అన్నారు విసుగ్గా.

'అదే పొరపాటు చేశాను బామ్మా! పెళ్ళి చేసుకుని నా భవిష్యత్తును నిర్ణయించుకునే స్వేచ్ఛ కోల్పోయాను. జీవితంలో ఎన్నో సాధిద్దామనుకున్నాను.

అన్నింటికీ ఫుల్ స్టాప్ పెట్టేయాల్సొచ్చింది, ఈ మనిషితో పెళ్ళయ్యాకా' అంది సంధ్య నన్ను ముద్దాయిని చూసినట్లు చూస్తూ. ఈ డైలాగులన్నీ జాంగో పెట్టె ఎఫెక్టే.

'నా దగ్గర జాంగో పెట్టె లేకపోయినా నేనూ మాట్లాడగలను'.

'జాంగో పెట్టేవిటి?'

'మీ మనుమరాలి బ్రెయిను అందులో ఉందండి' అన్నాను పెట్టె చూపిస్తూ - 'ఈ స్త్రీవాదంతో ఏడాది నుంచి నన్ను వేపించుకు తింటోంది. స్వేచ్ఛ తనేనా కోల్పోయింది? నేనూ కోల్పోయాను. నాకు బాంబేలో సోమర్స్ అండ్ విలియమ్స్ - మల్టీ నేషనల్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. గుర్తుందా? రెట్టింపు జీతం వచ్చేది. కానీ, నేను బాంబేలోనూ, సంధ్య ఇక్కడా ఉంటే సంసారమెలాగ అని ఆగిపోయా. సుందరం జాయినయిపోయాడు. నేను బాచులర్‌గా ఉంటే రెండో ఆలోచన లేకుండా ఎగిరి గంతేసి జాయినయిపోయేవాణ్ణి. సుందరం గాడిలా కారూ, హోదా అన్నీ వచ్చేవి. ఈ లగేజ్ గురించే ఆగిపోయా'.

'నేను లగేజ్ నా?'

'ఆ - లగేజ్ వే'.

'చూడు బామ్మా! ఎంత ఇన్సల్టింగుగా మాట్లాడుతున్నాడో' అంది సంధ్య రోషంగా.

'సంపూర్ణ స్వేచ్ఛ సంపూర్ణ సమానత్వంలాగే ఒక భ్రమ సంధ్యా' బామ్మగారు ఇద్దర్నీ ఆపుచేసి అన్నారు - 'ఎంత ఆదర్శవంతమైన సమాజంలో అయినా సరే, ఎవరికి తోచినట్లు వాళ్ళు ప్రవర్తించే స్వేచ్ఛ ఎవరికీ ఉండదు. అలాగే కుటుంబంలో కూడా ఇష్టం వచ్చినట్లు జీవించే స్వేచ్ఛ ఆడదానికీ లేదు, మగవాడికీ లేదు. కుటుంబం ఇద్దరి స్వేచ్ఛకూ పరిమితులు విధిస్తుంది. అవధులు లేని స్వేచ్ఛ జీవిత పరమావధి అని భావించేవారు నిరభ్యంతరంగా. ఒంటరిగా ఆ స్వేచ్ఛ అనుభవించవచ్చు. కానీ, భార్యాభర్తలు స్వేచ్ఛ పేరుతో ఎవరికి తోచిన దారిలో వారు పోతుంటే ఆ సంసారం నిలబడదు.

'నిలబడకపోతే నిలబడకపోనీ! తుమ్మితే ఊడిపోయే ముక్కులాంటి ఈ వివాహ వ్యవస్థని ఎవరు ఎంతకాలం కాపాడగలరు?'

'వివాహ వ్యవస్థలోని లోపాలు ఎలా నివారించాలా అని ఆలోచించాలి కానీ, అసలు వివాహ వ్యవస్థనే తిరస్కరించడం తలనొప్పికి మందు తల తీసెయ్యడమే అని వాదించడం లాంటిదే. భార్యాభర్తల మధ్య సున్నితమైన మానసిక సమస్యలు, లైంగిక

సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు - ఎన్నో రకాల సమస్యలు ఎదురవవచ్చు. ఓపిగ్గా వాటిని అధిగమిస్తూ సంసారం చెయ్యాలి కానీ....'

'బామ్మా! ఇన్ని సలహాలు మాకిస్తున్నావు కానీ, నువ్వు ఓపిగ్గా నీ సంసారం నిలబెట్టుకోకుండా తాతయ్యని ఎందుకు వదిలేశావు?' బామ్మగారి మాటలకి అడ్డు వస్తూ అంది సంధ్య.

నేను తెల్లబోయాను. సంధ్య అలా అడుగుతుందని నేననుకోలేదు. బామ్మగారూ అనుకుని ఉండరు. రెండు నిమిషాలు మాట్లాడకుండా అలా ఉండిపోయారు. తర్వాత సంధ్య కేసి చూస్తూ మొదలు పెట్టారు - "సంధ్యా! నువ్వు చిన్నప్పుడు నా వీపు మీద వాలి ఊగుతూ, 'బామ్మా! నీ వీపు మీద ఈ మచ్చలేంటే?' అని అడుగుతుండేదానివి, గుర్తుందా? నేను నవ్వుతూ మాట మార్చేసేదాన్ని కానీ, అవి కొరకంచుతో నా భర్తా, నా అత్త పెట్టిన వాతలన్న నిజం నీకెప్పుడూ చెప్పలేదు. ఇప్పుడు నీకు నన్ను నా భర్తతో ఎందుకు కలిసి ఉండలేదు అని నిలదీసి అడిగే వయసు వచ్చింది కాబట్టి, నీకు నా జీవితం గురించి వివరంగా చెప్పాల్సిన సమయం వచ్చింది.

"నాకు పదమూడో ఏట పెళ్ళయింది. పెళ్ళినాటికి అతని వయసు ఇరవై తొమ్మిది. అతనొక తిరుగుబోతు. అది పెళ్ళయిన తర్వాత తెల్సింది. అంత చిన్న వయసులో ఎందుకు పెళ్ళిచేశారా అని నా తల్లిదండ్రుల మీద కోపంగా ఉండేది. చాలా కాలం వాళ్ళతో మాట్లాడలేదు. తర్వాత తర్వాత, లోకం తెల్సుకున్నాక, అవిద్య, అజ్ఞానం, దారిద్ర్యం, సమాజంలో సంప్రదాయాలు మనుషుల్ని ఎలా నడిపిస్తున్నాయో చూశాక, వాళ్ళని కొంతవరకు అర్థం చేసుకోగలిగాను.

'పదమూడో ఏట కాపురానికి వెళ్లిన నేను ఏ బాధలు, చిత్రహింసలు అనుభవించానో నువ్వు ఊహించలేవు. తెల్లవారకట్ల నుంచి రాత్రి పదకొండయ్యే వరకూ నడుం విరిగే చాకిరి - తిండీ, నిద్రా ఉండేవికావు. నేను ఏడ్వని రోజు లేదు. ఆ నరకకూపం నుంచి ఎలా బయటపడాలో, ఏం చెయ్యాలో తెలియదు. నా తల్లిదండ్రులకు చెప్పుకుని ఏడ్చాను. వాళ్ళూ నాతో పాటే ఏడ్చారు కానీ, ఏవీ చెయ్యలేకపోయారు. ఎన్నోసార్లు ఆత్మహత్య చేసుకుందామనుకున్నాను కానీ, పసివాడు - మీ నాన్న మొహం చూసి ఆగిపోయేదాన్ని.

'అలాంటి దుఃస్థితిలో ఉన్న నన్ను మా మావయ్య దేవుడిలా ఆదుకున్నాడు.

'దాన్ని చంపేస్తారేమిటే' అని అమ్మానాన్నాలతో దెబ్బలాడి ఆ నరకం నుంచి బయటికి తీసుకువచ్చాడు. కానీ, మావయ్య పరిస్థితీ అంతంత మాత్రమే. అత్తయ్య

స్వతహాగా మంచిదే. కానీ, ఇంట్లో మరో ఇద్దరు ఎక్కువయ్యేటప్పటికి ఆవిడకి బాధ కలిగింది. 'వాళ్ళ అమ్మా నాన్నలకు లేని బాధ నీకెందుకు' అని మావయ్యతో దెబ్బలాడింది. 'ఏ కూలిపని చేసుకునో, అంట్లు తోముకునో, ఎలాగోలా బతుకుతాను. మీకు బరువు కాను. వెళ్ళిపొమ్మనకు అత్తయ్యా' అంటూ అత్తయ్య కాళ్ళు పట్టుకు ఏడ్చాను. అత్తయ్య కూడా నన్ను కౌగిలించుకుని ఏడ్చింది. ఆ తర్వాత ఎప్పుడూ నోరెత్తి ఒకమాట అనలేదు. ఉన్నంతలోనే మాకూ పెట్టేది. నాకు అప్పుడు పదహారేళ్ళు. చేతిలో చిల్లిగవ్వ లేదు. చదువు లేదు. ఏ కూలిపని చేసుకుని బతకడమో తప్ప గత్యంతరం లేదు అనుకుంటుంటే, పక్క ఇంటి పంతులుగారు జాలిపడి, 'గతం పీడకలలా మర్చిపోమ్మా! నీ జీవితం అంతా ముందుంది. నే చదువు చెబుతా - చదువుకో' అని ధైర్యం చెప్పి, ప్రోత్సహించి, తనే పలకా పుస్తకాలూ కొనిపెట్టి చదివించారు.

'మొట్టమొదటిసారి నేను పుస్తకం చదివినప్పుడు ఎంత ఆనందం పొందానో నీకు అర్థంకాదు సంధ్యా. చదువు నీకు చిన్నతనం నుంచీ నడకలా సహజంగా వచ్చింది. నా విషయంలో పుట్టుగుడ్డికి యుక్తవయసులో చూపు వచ్చినట్లయింది. నా కళ్ళముందు నేనంతకు ముందు ఎన్నడూ చూడని లోకం వెలిసింది. అంతవరకూ పిచ్చి కాగితాల్లా కనిపించిన వాటిలోంచి సజీవమైన మనుషులు నన్ను పలకరిస్తుంటే, కొత్త కొత్త భావాలు నన్ను ఊపేస్తుంటే, పిచ్చెక్కినట్లు కనిపించిన పుస్తకం, పేపరు, ఆఖరికి కిరాణా కొట్టు పొట్లాల కాగితాలు - ఏదీ వదలకుండా చదివాను. చదువు కొత్త చూపు ఇవ్వడమే కాకుండా, నాకు జీవనోపాధి కల్పించి నన్నొక మనిషిగా తీర్చి దిద్దింది.

'వివాహం అంటే అతి పవిత్రమైన బంధం అనీ, ఎట్టి పరిస్థితులలోనూ ఆ బంధం తెంచుకోకూడదనీ నేను అనను. ఏ కారణాలవల్ల నేనా భార్యాభర్తల మధ్య అగాధం ఏర్పడినప్పుడు, ఇంక కలిసి ఉండడం అసంభవమనుకున్నప్పుడు, విడిపోవడమే మంచిదంటాను.

'నాది చేదు అనుభవం అయినా, నేను పురుషులందర్నీ ద్వేషించను. తాను దారిద్ర్యంలో ఉండి కూడా నన్ను ఆదుకుని స్వంత బిడ్డలా చూసుకున్న మావయ్య మగవాడే. నాకు చదువు నేర్పి నన్ను మనిషిని చేసిన పంతులుగారు మగవాడే. నన్ను హింసించిన నా అత్త, నేను జీవితంలో ఎదుగుతుంటే అసూయతో నీలివార్తలు వ్యాపింపజేసిన సహోద్యోగుల్లో కొందరూ స్త్రీలే. మగవాళ్ళందరూ వంచకులూ కారు. స్త్రీలందరూ అమాయకులూ కారు. మంచీ-చెడూ ఇద్దరిలోనూ ఉంది.

'వ్యక్తులుగా ఇద్దరూ ఒకలాంటివారే అయినా, సమాజంలో ఒక భాగంగా మాత్రం స్త్రీ జాతికి చాలా అన్యాయం జరుగుతోంది. దానికి రాజకీయార్థిక సామాజిక కారణాలు, సంస్కృతి, మతపరమైన విశ్వాసాల్లాంటి కారణాలు అనేకం ఉన్నాయి....'

"బామ్మా! నువ్వు పుస్తకాలలోలా మాట్లాడుతున్నావు. మొగాడికి పురుషాహంకారం సహజంగానే వస్తోంది. ఆడది తన పంచన పడుండాల్సిందే అన్న భావం వదులుకోలేడు. ఈ మనిషి ఇందాకా నన్ను 'లగేజ్' అన్నాడు - గుర్తుందా? నా ఉద్యోగం నాకుంది. నా కాళ్ళమీద నేను నిలబడగలను. సోమర్స్ గారు, విలియమ్స్ గారు ఎడాపెడా తన్ని తరిమేస్తే - వాళ్ళది హైర్ అండ్ ఫైర్ పద్ధతి - ఇతనే నా పంచన చేరి నాకు లగేజ్ కావాల్సొచ్చేది. అన్ని విధాలా అతనితో సమానమైనదాన్నే అయినా, అతని పురుషాహంకారం అతని చేత ఎలా మాట్లాడిస్తోందో చూశావా?"

బామ్మగారు సంధ్య ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా, 'శంకర్రావు గుర్తున్నాడా?' అనడిగారు.

'ఏ శంకర్రావు?'

'నీకు మొదట చూసిన సంబంధం, రాఘవమ్మగారబ్బాయి' - నాకు ముందు శంకరరావు అనే వాడెవడో సంధ్యని చూశాడనగానే నా గుండెల్లో కలుక్కుమంది- '.... అతను అందగాడు, బుద్ధిమంతుడు. మీ ఈడూ-జోడూ బాగుండేది' - బామ్మగారి మాటలు నా గుండెల్లో కత్తుల్లా దిగబడుతున్నాయి -

'.... అయినా వద్దన్నావు. అతను నీకు నచ్చలేదని అనలేదు నువ్వు. నేను పోస్ట్ గ్రాడ్యుయేట్‌ని - బొత్తిగా మెట్రిక్‌తో ఏవిటి బామ్మా అన్నావు - గుర్తుందా?'

'దానికీ, దీనికీ సంబంధవేవిటి?'

'సమాజంలో ఆడదానికీ, మగవాడికీ నమూనాలున్నాయి. మనందరం కాన్షస్ గానో, అన్ కాన్షస్ గానో ఆ నమూనాలకి అనుగుణంగా ఉండడానికి ప్రయత్నిస్తాం. తనకు కాబోయేవాడు తనతో సమానమైనవాడు కానీ, తనకంటే అధికుడుకానీ అయి ఉండాలని ఆడపిల్ల అనుకుంటుంది. మగవాడు తన భార్య తనతో సమానమైనది కానీ, తనకంటే తక్కువది కానీ అయి ఉండాలనుకుంటాడు కానీ, తనకంటే అన్ని విధాల అధికురాల్ని భార్యగా అంగీకరించలేడు. నువ్వు శంకర్రావు విషయంలో సగటు స్త్రీగా ఎలా ఆలోచించావో, మగవాడు కూడా ఎంత ఆధునికంగా కనిపించినప్పటికీ అప్పుడప్పుడు సగటు మగవాడిలా పురుషాహంకారం చూపిస్తుంటాడు. అయితే, సమాజంతో పాటు ఈ నమూనాలు మెల్లగా మారుతున్నాయి. ఈ మార్పుకు దశాబ్దాలు పట్టవచ్చు. కానీ, మారక తప్పదు.

'స్త్రీకి ముందు కావాల్సింది చదువు, ఆర్థిక స్వాతంత్ర్యం అని నా అనుభవం ద్వారా తెలుసుకున్నాను. ఈ రెండూ ఉన్న స్త్రీ కుటుంబంలో, సమాజంలో తన స్థానాన్ని తాను నిర్ణయించుకోగల స్థితికి ఎదుగుతుంది.

'కుటుంబం ఆడదానికీ, మగవాడికీ, పిల్లలకూ భద్రతాభావన కలిగిస్తుంది. సమాజంలో ఒంటరిగా కాకుండా కష్టాలలో, సుఖాలలో నా వాళ్ళున్నారన్న ధైర్యం కలిగిస్తుంది....'

'బామ్మా! నువ్వు ఆదర్శ కుటుంబం గురించి మాట్లాడుతున్నావు కానీ, ఈ నాడు కుటుంబం నిజంగా ఎవరికైనా భద్రత ఇస్తోందా?'

'కుటుంబం సమాజానికి ప్రతిబింబం లాంటిది. సమాజ చిత్రం అస్తవ్యస్తంగా ఉంటే, ప్రతిబింబం కూడా అస్తవ్యస్తంగానే ఉంటుంది. సమాజాన్ని వదిలేసి ప్రతిబింబం మీద కత్తులు దూస్తున్నారు స్త్రీవాదులు. మనదేశంలో స్త్రీలలో మూడొంతులమంది నిరక్షరాస్యులు. నూటికి ఎనభైమందికి జీవనోపాధి లేదు. బిందెడు నీళ్ళకోసం, పొయ్యిలో పుల్లకోసం స్త్రీ మైళ్ళకు మైళ్ళు నడవాల్సొస్తున్న వెనుకబడినతనం మనది. ఆస్పత్రి మెట్లమీద ప్రసవించి గర్భిణీ స్త్రీ, బిడ్డా దిక్కులేని చావు చస్తున్న దేశం ఇది. ఈ దుస్థితికి పితృస్వామ్య వ్యవస్థ, పురుషాధిక్యత కారణమందామా, లేక మరేమైనా కారణాలున్నాయా అని ఆలోచిద్దామా? దిక్కులేని స్త్రీ లందరికీ జీవనోపాధి కల్పించి వారి పరిస్థితి మెరుగు పర్చాలంటే ప్రస్తుతం ఉన్న వ్యవస్థతో తలపడాలి. ఇది కొండకేసి తల బద్దలుకొట్టుకోడం లాంటిది. ఈ దారిన నడిస్తే తలలు పగులుతాయి కానీ, గుర్తింపు రాదు. దాని కంటే తేలికమార్గం ఎందుకున్నారు ఈ నాయకురాళ్ళు.

వీళ్ళ స్త్రీవాదం, మొగుణ్ణి డ్రాయింగు రూంలోంచి జుట్టు పట్టుకుని వంటింట్లోకి ఈడ్చుకొచ్చి, తాను వంటింటి నుంచి విముక్తి పొందాలన్న సగటు మధ్యతరగతి స్త్రీ ఆకాంక్షలకి రూపం. వాళ్ళ ఉద్యమం వంటింటికీ, పడకటింటికీ పరిమితం. వీళ్ళకి భార్యాత్వం బానిసత్వంగానూ, సంసారం లైంగిక హింసగానూ, మాతృత్వం స్త్రీపై మోపబడిన శిలువలాగానూ కనిపిస్తుంది. విశాల ప్రపంచం కనిపించదు. వీళ్ళ పరిధి సంకుచితం. వీళ్ళ దృష్టి సంకుచితం. వీళ్ళ ఆలోచనలు సంకుచితం. వీళ్ళ యుద్ధం నీడలతో. వీళ్ళు సెమినార్లలో, వర్క్‌షాపుల్లో, టీ కప్పుల్లో సృష్టించే విప్లవాలూ, మీడియాలో తీసుకొచ్చే తుఫానులూ సామాన్య స్త్రీకి ఒరగబెట్టేదేవీ లేదు.

ఈ ఉష్ట్రపక్షుల సంగతి మర్చిపోయి, నీ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని నీ కళ్ళతో చూడు. లోకంలో కోట్లమంది యువతీ యువకులు పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారు.

అందరూ ఏ ఆనందం లేకుండా నిస్సారమైన జీవితాలే గడుపుతున్నారా? భార్యాభర్తల మధ్య బానిస యజమానుల సంబంధాలే కానీ, మరే ప్రేమ బంధం నీకు కన్పించడం లేదా?

జీవితం అంటే ఒక సమగ్ర దృక్పథం ఏర్పరచుకుని, పంతాలకు, పట్టింపులకూ పోయి బతుకు నాశనం చేసుకోకుండా, సర్దుకు పోతూ హాయిగా బతకండి'

బామ్మగారు అలా మాట్లాడుతుంటే, 'శేఖరం' అంటూ సీన్లోకి దిగాడు సాంబుడు. ఇంట్లో అడుగు పెట్టగానే సంధ్యా, బామ్మగారూ కనిపించడంతో వాడికి మతి పోయింది. బొమ్మలా నిలబడి కళ్ళప్పగించి చూడసాగాడు. సాంబుడి వీపు మీద ఓ గుద్దు గుద్ది, వాడికి తెలివొచ్చాకా బామ్మగార్ని పరిచయం చేశాను.

'నా పేరు సాంబుడండి – అఖిల భారత భార్యా పీడితుల సంఘం కార్యదర్శిని' అన్నాడు సాంబుడు, తన్ను తాను పరిచయం చేసుకుంటూ. ఆ మాట వినగానే సంధ్య విసురుగా లేచి లోపలికి వెళ్ళి పోయింది.

'ఏం చేస్తారమ్మా మీరు?' అనడిగారు బామ్మగారు.

'మగ విముక్తి – అంటే మా ఉద్యమం స్త్రీలకు వ్యతిరేకం అనుకోకండి. మేం స్త్రీ ద్వేషులం కామండి. మగవాళ్ళతో పాటు, ఆడవాళ్ళనీ విముక్తి చేస్తామండి. ముందు అసలు ప్రేమ లేని చోట పెళ్ళి ఉండకూడదండి. ప్రేమున్న చోట పెళ్ళి అవసరం లేదండి. ఆడా మగా స్వేచ్ఛాజీవుల్లా కావాలనుకున్నప్పుడు కలిసి ఉంటారు – అక్కర్లేదనుకున్నప్పుడు విడిపోతారు....'

'నువ్వు చెప్పే స్వేచ్ఛ కోట్ల సంవత్సరాల నుంచీ జంతుజాలంలో ఉంది. పిల్లలను యుక్తవయసు వచ్చేదాకా పదహారు, పదిహేడేళ్ళు సాకాల్సిన ఆవశ్యకత జంతువుల్లో లేదు – మనుషుల్లోనే ఉంది. మనుషులు కూడా నువ్వు చెబుతున్నట్లు జంతువుల స్థాయికి ఎదిగి, అవసరమైనప్పుడు కలిసి, అనవసరమనుకున్నప్పుడు విడిపోతే పిల్లలేవైపోతారు' అన్నారు బామ్మగారు.

'బామ్మగారిదంతా చాదస్తం. ఇప్పుడు మాత్రం పిల్లలు సమస్యల్లేకుండా ఆనందంగా ఉన్నారా? పిల్లల సంగతి తర్వాత ఆలోచించవచ్చు'.

'స్త్రీ విముక్తి అంటూ స్త్రీవాదులూ, పురుష విముక్తి అంటూ మీరూ – చెరోపక్క నుంచీ కొంపలు అంటిస్తారన్నమాట. పిల్లల సంగతి తర్వాత ఆలోచిస్తారా?'– ఆవిడ కళ్ళు తీక్షణంగా సాంబుడి కేసి చూస్తున్నాయి. ఆవిడ పేలబోయే బాంబులా ఉంది. సాంబుడి గాడికి అదేవీ అర్థమయినట్లు లేదు.

'..... అసలు ఆడ, మగా రెండూ శత్రువర్గాలండి. పీడకులకు, పీడితులకు వర్గపోరాటం అనివార్యమండి' అంటూ వాడు ఏదో వాగుతుంటే, ఎందుకైనా మంచిదని శర్మగారిని చూసే నెపంతో బయటికి జారుకున్నాను.

శర్మగారు ముందు గదిలోనే కళ్ళు మూసుకుని పడుకుని మూలుగుతున్నారు. నేను తలుపు గెంటి లోపలికి వెళ్ళగానే ఆయన కెవ్వుమని, 'వచ్చేశావా నాయనా- తీసుకు పోవడానికి' అని గొల్లుమన్నారు.

'ఏవిటి శర్మగారూ?'

ఆయన పూర్తిగా కళ్ళు తెరిచి, గుర్తుపట్టి, 'నువ్వా? యమభటుడివనుకున్నాను - అయినా, ఆ వెధవ ఎర్రపేంటూ, పచ్చచొక్కా ఏవిటి?' అన్నారు చికాగ్గా. యమభటుడి యూనిఫాం అలా ఉంటుందని ఆయన ఎలా అనుకున్నారో నాకు అర్థం కాలేదు.

ఆయన అలా నాతో మాట్లాడుతుంటే, ఎదురింటి ఆంజనేయులుగారు హడావిడిగా వచ్చి - 'ఏవిటి శర్మగారూ! మీకు ఏక్సిడెంటయ్యిందట. ఇప్పుడే టూరునుంచి వచ్చాను. వచ్చీరాగానే మా ఆవిడ ఈ వార్త చెప్పింది. మరి ఆలస్యం చెయ్యకుండా పరిగెట్టుకొచ్చాను - మళ్ళీ చూడగలనో, లేదో అని కంగారు పడుతూ. అసలేం జరిగిందట?' అనడిగారు.

'పొద్దుట తొమ్మిదింటికి కేబులువాడు రామాయణం వేస్తుండగా ఇంట్లోంచి బయటికి వచ్చి....'

'రామ... రామ.... రామాయణం మొదలవుతుండగా టీవీ ముందు నుంచి లేచిపోవడం మహాపాపమండి. రామానంద్ సాగర్ గారు చెప్పలేదూ?'

'చెప్పారా? నాకు గుర్తులేదండి. అందుకే ఇలా జరిగిందేమో! అలా గేటు దగ్గర నిలబడ్డానా? ఆ ఛళాన నెత్తిమీద ఠఫ్ మని ఏదో పగిలిందండి'.

'నెత్తిమీద పగిలిందా? నెత్తి పగిలిందా?' అపరాధ పరిశోధకునిలా ప్రశ్నించారు ఆంజనేయులుగారు.

'అదే సరిగ్గా తెల్సి చావటల్లేదండి.... అవడమేమో నెత్తిమీద పేలినట్లయింది కానీ, ఏవీ కనిపించలేదు'.

ఆంజనేయులు గారు నిట్టూర్చి, అంతవరకూ తుడుస్తున్న కళ్లజోడు కళ్ళకు తగిలించి శర్మగారికేసి చూస్తూ, 'శర్మగారూ - మీరేవీ అనుకోకపోతే ఓ మాట చెప్పనా?' అన్నారు.

'ఈ క్షణమో, మరుక్షణమో అన్నట్లున్నా - ఇంకా అనుకోడవేవిటి? చెప్పండి'.

'మీరు ప్రాణాయామం గురువు పర్యవేక్షణలో చెయ్యాలండి. లేకపోతే అలాగే దెబ్బ తీస్తుంది'.

'నిజంగానా?'

'నిజం. అదృష్టం బావుండి మీ బుర్రలో ఫ్యూజ్ పనిచేసి ప్రెషరు తగ్గింది. లేకపోతే ప్రెషరు కుక్కరు పేలినట్లు బుర్ర పేలిపోయేది....'

వాళ్ళ కబుర్లు విని విని, అరగంట తర్వాత మెట్లెక్కుతోంటే సాంబుడు ఎదురయ్యాడు. అట్లాసు మీద పిల్లాడి బొమ్మ - భూగోళమంత తలకాయ, చిన్నచిన్న కాళ్ళతో ఉంటుందే - అలా ఉన్నాడు వాడు.

'ఏవిటి అలా ఉన్నావు?' అన్నాను గుమ్మడి కాయంత తలకేసి ఆశ్చర్యంగా చూస్తూ.

'తల వాచేటట్లు చివాట్లు తిన్న తల ఇంకెలా ఉంటుంది? నన్ను పులిముందు పడేసి నువ్వెక్కడికెళ్ళిపోయావు?'

'శర్మగారిని చూద్దావని...'

సాంబుడు కళ్ళ నీళ్ళు తిరుగుతుండగా అడిగాడు - 'నేను చెడ్డకోతినా?'

నేను జంతు శాస్త్రం చదవలేదు. కోతుల్లో మంచి కోతుల్ని, చెడ్డ కోతుల్ని ఎలా గుర్తించాలో నాకు తెలియదు.

'ఏం? అలా అడుగుతున్నావు?'

'తా చెడ్డకోతి వనమెల్లా చెరిచిందని... నేను అందర్నీ పాడు చేస్తున్నానట. బామ్మగారన్నారు' అన్నాడు వాడు ఏడుపు మొహం పెట్టి - 'నేను నిన్ను పాడు చేస్తున్నానో, బాగు చేస్తున్నానో నీకే తెలుస్తుంది. రేపు పదకొండు గంటలకి చిరంజీవి ఇనపకొట్టు దగ్గరకు రా'.

'ఎందుకు?'

'ఎందుకేవిటి? అభాసం కార్యవర్గ సమావేశం ఉంది'.

'నేను రాను'.

'ఎందుకు రావు?'

'సంధ్య వచ్చేసింది కదా'.

'ఓరి ద్రోహీ! గాజుల గలగలలు వినిపించగానే మతి పోయిందన్నమాట. ఇలాంటి నరాల బలహీనత ఉన్నవాళ్ళు విప్లవాలకి పనికిరారు. నిన్ను సంఘం నుంచి బహిష్కరిస్తున్నాను'.

'నేనే నీ బోడి సంఘాన్ని బహిష్కరిస్తున్నాను'.

'ఏమన్నావు?' అన్నాడు వాడు నమ్మలేనట్లు.

'బోడి సంఘవన్నాను... ఒక్క నిమిషం ఆగు' అని లోపలకు పెళ్ళి జాంగో పెట్టి ఈడ్చుకొచ్చి వాడి తలకెక్కించాను.

'చచ్చిపోయాను. ఏవిటిది? ఇంత బరువుంది' అన్నాడు వాడు అణగిపోతూ.

'స్త్రీ వాదం! ఇదీ, నీ మగవాదం - రెండూ కలిపి గోదాట్లో పడెయ్యి'.

'రెండూ కలిపా?' అన్నాడు సాంబుడు సందేహంగా.

'ఏం? గోదావరి కలుషితమైపోతుందంటావా?' - వాడి సందేహం చూసి నాకు కూడా సందేహం వచ్చింది.

'కాదు - పిల్లవాదాలు పుట్టుకొస్తాయేమోనని'

సాంబుణ్ణి తరిమేసి నేను లోపలికి వెళ్ళేటప్పటికి బామ్మగారు లోపల గదిలో మనుమరాలితో '.... అతనికేమే - బంగారం' అని ఏదో అంటున్నారు. నేను వచ్చిన అలికిడయ్యి బామ్మగారూ, మనుమరాలూ ఇద్దరూ హాల్లోకి వచ్చారు. సంధ్య తెల్లచీర కట్టుకుని, తెల్ల జాకెట్టు వేసుకుని ఉంది. సంధ్యని చూడగానే 'పిటపిటలాడే పిల్లదానా' అనే రౌడీ పాటొకటి నోటి చివరదాకా వచ్చింది కానీ బామ్మగారున్నారని ఆగిపోయాను.

'బామ్మా! నీ బంగారాన్ని పక్క ఎక్కడ వెయ్యమంటాడో అడుగు' అంది సంధ్య. ఆ అనడంలో ఆహ్వానం ఉంది కానీ, రమ్మంటే వెళ్ళడానికి, పొమ్మంటే పోడానికి మనం కీలు బొమ్మలం కాదు కదా! పైగా సూటిగా నన్నడగకుండా డొంకతిరుగుడుగా మాట్లాడ్డం దేనికి? అలాంటి తల తిరుగుడంటేనే నాకు ఒళ్ళు మంట.

'నా కెవరూ ఎక్కడా పక్క వెయ్యక్కర్లేదు. నా ఇల్లు, నా ఇష్టం వచ్చిన చోట పడుకుంటా - బాల్కనీలోనో, సోఫాలోనో....'

'..... డైనింగ్ టేబుల్ మీదో' - వెటకారంగా అంది సంధ్య.

'ఐడియా బావుంది. ఫర్ ఏ ఛేంజ్ - ఇవ్వాళ డైనింగ్ టేబులు కింద పడుకుంటాను'

'బామ్మా! నాకు నిద్దరొస్తోంది. నే పడుకొంటున్నాను' అని సంధ్య లోపలికి వెళ్ళిపోయింది.

నేను డైనింగ్ టేబులు కింద దూరబోతుంటే, 'పిచ్చి వేషాలెయ్యక లోపల పడుకో' అని మందలించారు బామ్మగారు.

'నాకు పెద్దలంటే గౌరవం. మీ మాట కాదనను' అని టేబులు కింద నుంచి లేచి పడక గదిలోకి నడిచాను. గదిలో అగరొత్తుల, సెంట్ల ఘుమ ఘుమ ఒక క్షణం మత్తెక్కించింది.

'ఇది పడకగది - డైనింగ్ టేబులు ఇక్కడ లేదు' అంది సంధ్య గీరగా.

నేనేం తక్కువ తిన్లేదు - 'బామ్మగారి మనసు బాధ పెట్టడం బాగోదని వచ్చాను కానీ, విజయశాంతి ఇరవైతొమ్మి.....' - నా మాట పూర్తికాకుండా సంధ్య విసురుగా వచ్చి పెదాలతో నా నోరు నొక్కేసి లైటార్పేసింది.

*(ఇండియా టుడే. జనవరి 6-20, 1997)*